

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎవరో?



- నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 24 గంటల తర్వాతే ఫలితం వెలువడే అవకాశం
- గుంటూరు ఏసీ కళాశాలలో పకడ్బందీగా ఈసీ ఏర్పాట్లు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి మరికొన్ని గంటల్లో నూతన సభ్యుడెవరో తేలిపోనుంది. గత నెల 27న పోలింగ్ జరగ్గా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి గుంటూరు లోని ఏసీ కళాశాలలో ప్రారంభం కానుంది. బ్యాలెట్, ప్రాధాన్య ఓట్ల విధానంతో ఓట్ల లెక్కింపు జరగనుంది. భారీగా పోలింగ్ నమోదైన దృష్ట్యా తుది ఫలితం వెలువడ టానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నది. దీంతో ప్రధాన అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో రాజకీయంగా అంతగా పలుకుబడి లేని నాయకులే టీడీపీ తరపున బరిలోకి దిగారు. ఈ దఫా అందుకు భిన్నంగా దశాబ్ధాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉండి టీడీపీలో ఎమ్మెల్యే, మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని పోటీకి దింపింది. దీంతో పార్టీ శ్రేణులతో జనసేన, బీజేపీ నేతలు ఆలపాటి గెలుపు కోసం కృషి చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ మొదలు పోలింగ్ ముగిసేంత వరకు శ్రమించాయి. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు అండగా నిలిచాయి. అయితే ఓటర్లు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల నుంచే కాకుండా డిగ్రీ పూర్తి చేసిన చాలామంది నమోదు చేసుకున్నారు. దీంతో వారి తీర్పు ఈ దఫా కీలకం కానుంది. ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారు ధీమా

(మిగతా 8వ పేజీలో)



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

అమరావతిలో.. అతి పెద్ద స్టేడియం

రివర్‌ఫ్రంట్.. గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి ఆవిర్భవించబోతున్నది. ఇలాంటి రాజధాని నగరం క్రీడారంగంలో కూడా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోనున్నది. అమరావతి.. ప్రపంచ క్రీడారంగానికి ఓ దిక్సూచిగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. క్రికెట్ ప్రపంచానికి మరో మెల్‌బోర్న్‌గా అమరావతి స్పోర్ట్స్‌సిటీని తీర్చిదిద్దనున్నది. ఈ క్రమంలో ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని అత్యాధునికంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మంత్రి లోకేశ్ సూచన మేరకు 60 ఎకరాల విస్తీర్ణంలో రూ.800 కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణం జరగనున్నది. క్రికెట్ ప్రపంచానికి తలమానికంగా అమరావతిలో క్రికెట్ స్టేడియం నిర్మించే విషయంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మంత్రి లోకేశ్‌కు సహకరిస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే 2027 కల్లా అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అమరావతిలో ఆవిర్భవించనున్నది.



మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- అంతాసవ్యంగా జరిగితే 2027 కల్లా ఆవిర్భావం
- ఏసీఏకు 60 ఎకరాలు ఉచితంగా ఇవ్వనున్న ప్రభుత్వం
- రాజధాని సిగలో మరో ఆణిముత్యంగా భాసిల్లేలా మంత్రి లోకేశ్ ప్రణాళిక

మంగళగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనేక ప్రత్యేకతలకు నిలయంగా మారనున్న అమరావతిలో ఏ నిర్మాణం చేపట్టినా.. మరే ప్రాజెక్టును తలపెట్టినా అదో ఐకానిక్‌గా ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఉండాలన్న పట్టుదల చంద్రబాబుది. అమరావతి నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని కూడా అదరహో అన్న చందాన నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలో అతిపెద్దదిగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంను మించి మరిన్ని సౌకర్యాలతో అమరావతిలో అగ్రగామిగా నిర్మించాలని నిర్ణయించారు. అమరావతి మాస్టర్‌ప్లానులో క్రీడా నగరాన్ని ప్రభుత్వ నగరానికి పశ్చిమంగా నదీతీరం వెంబడి సుమారు 1600 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత భౌతిక పరిస్థితులకు అనుగుణంగా చెప్పాలంటే బోరుపాలెం, అబ్బురాజుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, తుళ్లూరు పరిధిలో క్రీడా నగరం ఏర్పాటుకానున్నది. ఈ ప్రాంతంలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని భారీ హంగులతో నిర్మించాలని మంత్రి లోకేశ్ ప్రభుత్వానికి సూచించారు. తన ఈ ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు ఆయన ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలను పరిశీలించే కార్యక్రమాన్ని ఇప్పటికే చేపట్టారు. గతవారం షార్జాలో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను శివనాథ్‌తో కలిసి తిలకించిన మంత్రి లోకేశ్.. అక్కడ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు జైషాను కలిసి అమరావతి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం గురించి చర్చించారు.

రూ.800 కోట్లకు పైగా ఖర్చు

అమరావతిలోని స్పోర్ట్స్ సిటీలో రివర్ ఫ్రంట్ స్టేడియంగా దీనిని నిర్మించాలని ప్రాథమికంగా లోకేశ్ నిర్ణయించారు. ఇందుకోసం 60 ఎకరాలను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు ఉచితంగా ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూచన ప్రాయంగా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నరేంద్ర మోదీ స్టేడియంను రూ.800 కోట్లతో లక్షా 32 వేల సీటింగ్ సామర్థ్యంతో 63 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఇది మెల్‌బోర్న్ స్టేడియంను దాటేసి ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచింది. అయితే అమరావతి నరేంద్రమోదీ స్టేడియంను మించి నిర్మించాలంటే భారీ వ్యయమవుతోందన్న (రూ.800 కోట్లను మించి) అంచనాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ భారీ వ్యయాన్ని అందుకునేందుకు బీసీసీఐ నిధులకు తోడు మరికొన్ని నిధులను ప్రైవేటు సెక్టారు నుంచి సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దానికి సంబంధించిన సాధ్యాసాధ్యాల గురించి ప్రభుత్వం కూలంకుషంగా చర్చిస్తుంది.

ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం...



రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపులు చేసిన వెంటనే నిర్మాణ పనులను ఆరంభిస్తాం. అహ్మదాబాద్ స్టేడి యానికి ఏ మాత్రం తీసిపోని విధంగా నిర్మిస్తాం. అలాగే మంగళగి రిలోని స్టేడియాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం రంజీ మ్యాచ్‌ల వరకు మంగళగిరి స్టేడియాన్ని వినియోగించుకుంటాం. అమరావతిలో నిర్మించాలనుకుంటున్న అంతర్జాతీయ స్టేడియం గురించి మంత్రి నారా లోకేశ్ ఐసీసీ, బీసీసీఐ ప్రతినిధులతో నిరంతరం చర్చిస్తున్నారు.

- కేశినేని శివనాథ్, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ

రెండు అంతర్జాతీయ స్టేడియాలు

అమరావతిలోని స్పోర్ట్స్‌సిటీలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మిస్తే.. రాజధాని అమరావతిలో రెండు అంతర్జాతీయ స్టేడియాలు అవుతాయి. మంగళగిరిలోని అమరావతి టౌన్‌షిప్‌లో రూ.వంద కోట్లతో నిర్మించిన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు చివరిదశకు వచ్చాయి. ఇంకో పాతిక, ముప్పై కోట్లు ఖర్చు చేస్తే అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు ఈ స్టేడియం సిద్ధమవుతుంది. స్టేడియం చుట్టూ గ్రీనరీతోపాటు రోడ్లు, లైటింగ్, హోటల్ వంటి సౌకర్యాలతో పాటు నిడమర్రు రోడ్డులో రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్‌ను నిర్మించాలి. ఈ పనులు ఏడాదిలోగా పూర్తి చేస్తామని ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తాజాగా ప్రకటించారు. అయితే అమరావతి స్పోర్ట్స్ సిటీలో క్రికెట్ స్టేడియంను నిర్మించాలన్న ప్రతిపాదనల నేపథ్యంలో మంగళగిరి స్టేడియాన్ని పూర్తి చేస్తారా లేదా అన్నది సందేహాత్మకంగా మారింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.21 (సోమవారం)
సహరి : 5.08 (మంగళవారం)

రాయితీపై.. రుణాలు

- ఈబీసీల కోసం ప్రభుత్వం కసరత్తు
- 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- బీసీ కార్పొరేషన్ ద్వారా పంపిణీకి చర్యలు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ మొదలు
- మూడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి
- బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అగ్రవర్ణాల్లోని పేదలకు ఊతమివ్వడానికి కూటమి ప్రభుత్వం రాయితీపై రుణాలివ్వడానికి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు జిల్లాల వారీగా యూనిట్ల కేటాయింపు, కులాల వారీగా మార్గదర్శకాలను గతంలోనే విడుదల చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రుణాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. గతంలో మంజూరు చేసిన యూనిట్లకు అదనంగా కుట్టుమిషన్లు, జనరిక్ షాపుల కేటాయింపులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా యూనిట్ల వారీగా అర్హత సాధించిన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపట్టనుంది. ఈబీసీ రుణాలను కూడా బీసీ కార్పొరేషన్ ద్వారానే ప్రభుత్వం ఇవ్వనుంది. తాజా బడ్జెట్ కేటాయింపుల్లో బీసీ కార్పొరేషన్‌కు నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించింది. నిధుల సమస్య కూడా లేనందున దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల గుర్తింపు జరిపి మార్చి నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేసి అగ్రవర్ణ పేదలకు లబ్ధి చేకూరుస్తామని అధికారులు చెబుతున్నారు. ఈబీసీ కోటా కింద గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 15,000 మందికి లబ్ధి చేకూర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలో 3,600 మందికి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి 11,400 మందికి ఈ పథకం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రణాళికలు రచించింది. రాయితీ రుణాలపై అందించే యూనిట్లలో ప్రధానంగా ఫ్యాషన్ డిజైనింగ్, డెయిరీలు, ఇతర చిన్న తరహా యూనిట్లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. రాయితీ రుణాల నిమిత్తం మూడు జిల్లాల పరిధిలో రూ.130 కోట్ల వరకు రుణాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అందించనుంది. ఈ యూనిట్లకు తోడు అదనంగా కుట్టుమిషన్ల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 16,000 మంది అగ్రవర్ణ పేదలకు మేలు జరిగేలా చూడాలని నిర్ణయించింది. వీటితో పాటు బీ ఫార్మసీ కోర్సుల్లో అర్హత ఉన్న వారికి శిక్షణ ఇచ్చి ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయబోయే జనరిక్ దుకాణాల్లో కూడా వాటా ఇవ్వనున్నది.



ఈబీసీ రుణాలపై సమీక్ష చేస్తున్న జేసీ ప్రఖర్‌జైన్ (పాత చిత్రం)

ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే పూర్తి..

అగ్రవర్ణాల్లో ఆర్థికంగా అట్టడుగున ఉన్న వారి సంఖ్య తేల్చడానికి ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసింది. ఈబీసీ కేటగిరీలోకి వచ్చే రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, కాపుతో పాటు ఇతర కులాల్లో ఉండే పేదల జాబితాను రూపొందించింది. ఈ నెల 9 నుంచి ఈబీసీ రాయితీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ జరగనున్నది. వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న డేటాతో సరిపోల్చుకుని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

70,000 దరఖాస్తులు వస్తాయని అంచనా

ఈబీసీ రాయితీ రుణాల కోసం మూడు జిల్లాల పరిధిలో దాదాపు 70,000 వరకు దరఖాస్తులు వస్తాయనేది అధికారుల అంచనా. ప్రభుత్వం కేటాయించిన 15,000 యూనిట్లు తొలి విడతలో భాగమేనని, ఈబీసీ కేటగిరి కిందకు వచ్చే అర్హులైన పేదలందరికీ దశల వారీగా న్యాయం జరిగేలా చూస్తామనేది ప్రభుత్వ మాటగా ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వంలో దాదాపు 4,000 దరఖాస్తులు ఈబీసీ రాయితీ రుణాల కోసం వచ్చినవి ఉన్నాయి. వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా గత ప్రభుత్వం తాత్సారం చేయడంతో పాటు రాయితీ రుణాల నిధులను కూడా పక్కదారి మళ్లించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం జరిగే ప్రక్రియలో వైసీపీ ప్రభుత్వంలో మూలన పడిన దరఖాస్తుల్లో అర్హులైన వారు ఉంటే వారికి కూడా ప్రయోజనం దక్కేలా చూడనున్నారు.

మహిళలకే తొలి ప్రాధాన్యం..

స్వయం ఉపాధి యూనిట్ల కోసం అందించే రాయితీ రుణాల విషయంలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. దానిలో భాగంగానే సదరు యూనిట్లు కూడా ఎక్కువ శాతం అతివలకు సంబంధించినవే ఉన్నాయి. ఫ్యాషన్ డిజైనింగ్, బొటిక్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్ వంటి వన్నీ కూడా ఎక్కువ శాతం మహిళలు రాణిస్తున్న రంగాలే కావడం గమనార్హం.

ఆయా రంగాల్లో నిపుణులచే శిక్షణ..

యూనిట్లు కేటాయించడమే కాకుండా వారు ఎంచుకున్న రంగంలో విజయం సాధించేలా నిపుణుల చేత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వమే చేపట్టనుంది. ఇప్పటికే లబ్ధిదారులు ఎంచుకున్న రంగంపై వారికి అవగాహన ఉంటే మరింత సానపట్టి వారిచేతే మిగిలిన వారికి శిక్షణ ఇప్పించే ప్రయత్నం కూడా అధికారులు చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడాన్నే అత్యంత కీలకం. శిక్షణకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలను జారీ చేసింది.

జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించండి



శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరి ఎస్సైలకు దిశానిర్దేశం చేస్తున్న ఐజీ త్రిపాఠి

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి పోలీస్ శాఖ పేరు ప్రతిష్ఠలను ఇనుమడింప చేయాలని రేంజ్ ఐజీ ఎస్ఎస్‌పి త్రిపాఠి ఆదివారం సూచించారు. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరి ఎస్సైలను జిల్లాలకు కేటాయించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు అభినందనలు తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధి కింద 53 మంది ఎస్సైలు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని ఆదివారం ఐజీని మర్యాద పూర్వకంగా కలవగా, వారికి జిల్లాలను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందించారు. వీరిలో 36 మంది పురుషులు, 17 మంది మహిళలు ఉన్నారు. గుంటూరు జిల్లాకు 22 మంది, పల్నాడు జిల్లాకు 13 మంది, బాపట్ల జిల్లాకు 10 మంది, ప్రకాశం జిల్లాకు ఒకరు, నెల్లూరు జిల్లాకు ముగ్గురు, తిరుపతి జిల్లాకు నలుగురిని కేటాయించారు. వారికి ఈ నెల 2 నుంచి 6 వరకు సెలవు మంజూరు చేసి, తిరిగి 7 నుంచి గ్రేహౌండ్స్ శిక్షణ కొరకు పంపించనున్నట్లు ఐజీ తెలిపారు.

'గ్రీన్ గ్రేస్'కు జారీ చేసిన ఈసీ ఆర్డర్స్ నిలుపుదల

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివాదాస్పద గ్రీన్ గ్రేస్ హైరైజ్డ్ అపార్టుమెంట్స్‌కు పర్యావరణ శాఖ గతంలో జారీ చేసిన ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ఆర్డర్స్‌ని నిలుపుదల చేస్తూ రాష్ట్ర స్థాయి ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ(ఎస్ఈఐఏఏ) ఉత్తర్వులు జారీ చేసింది. గ్రీన్ గ్రేస్‌లో జరుగుతున్న అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అవిశ్రాంతంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఆయన ఇటీవలే విజయవాడలోని ఎస్ఈఐఏఏ కార్యాలయానికి వెళ్లి గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్స్ యాజమాన్యం కన్‌సెంట్ టూ ఎస్టాబ్లిష్ (సీటీఈ)ని పర్యావరణ శాఖ నుంచి పొందలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ స్పందించి అన్ని వివరాలను ఇక్కడి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల నుంచి తెప్పించుకొన్నది. గత నెల 27వ తేదీనే ఆ ప్రాజెక్టుకి 2015 జూలై 9, 2021 జూలై 29వ తేదీన జారీ చేసిన ఈసీ ఆర్డర్స్‌ని నిలుపుదల చేసింది. ఏపీపీసీబీ నుంచి సీటీఈ తీసుకోకపోవడమే కాకుండా పరివేష్ పోర్టల్‌లో ప్రతి ఆరు నెలలకు అప్‌లోడింగ్ చేయాల్సిన కాంప్లియన్స్ రిపోర్టులను కూడా చేయలేదు. ఈ రెండు ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకొని పర్యావరణ అనుమతుల ఉత్తర్వులను నిలిపేస్తున్నట్లు ఆ సంస్థ ప్రొసీడింగ్స్ జారీ చేయగా అవి ఆదివారం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా షాలిమార్, సంత్రగచి, చర్లపల్లికి ప్రత్యేక రైళ్లను ఈ నెలలో నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07703 చర్లపల్లి - షాలిమార్ ప్రత్యేక రైలు ఈ నెల 9, 16 తేదీల్లో రాత్రి 7.45కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదుగా రెండో రోజు వేకువజామునకు ముందు 2 గంటలకు షాలిమార్ చేరుకొంటుంది. నంబరు 07704 షాలిమార్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 11, 18 తేదీల్లో వేకువజామున 5 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8.10కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 07705 చర్లపల్లి - సంత్రగచి ప్రత్యేక రైలు ఈ నెల 7, 21 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.30కి సంత్రగచి చేరుకొంటుంది. నంబరు 07706 సంత్రగచి - చర్లపల్లి రైలు ఈ నెల 8, 22 తేదీల్లో మధ్యాహ్నం 12.35కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.40కి చర్లపల్లి చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

మిర్చియార్డుకు నూతన పాలకవర్గం

- ఈ నెలలోనే మార్కెట్ కమిటీలను భర్తీ చేస్తామన్న సీఎం
- ప్రయత్నాల్లో ఆశావహులు



గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు)కు ఈ నెలలోనే నూతన పాలకవర్గం ఖరారు చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయించారు. అన్ని ఏఎంసీల్లో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ఆయన చేసిన ప్రకటన ఆశావహుల్లో ఆనందాన్ని కలిగిస్తుంది. ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తి కావడంతో ఎప్పుడెప్పుడు మిర్చియార్డు ఛైర్మన్, పాలకవర్గ సభ్యులను నామినేట్ చేస్తారా అని వెయ్యి కళ్లతో నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. దీంతో మళ్లీ తమ నేతల ద్వారా అధిష్టానానికి సిఫార్సు చేయించేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు. అయితే మిర్చియార్డు ఛైర్మన్ పదవి అనేది ఎంతో కీలకమైంది. దీనిని అన్ని కమిటీలతో పాటు భర్తీ చేస్తారా, ప్రత్యేకంగా చూస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

పదవికి డిమాండ్ తగ్గలేదు..

ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి వాణిజ్య కేంద్రంగా మిర్చియార్డుకు గుర్తింపు ఉంది. ఒకానొక సందర్భంలో ఛైర్మన్ పదవి ఎమ్మెల్యే స్థాయిలో ఉండేది. ఇందుకు కారణం అప్పట్లో ఈ యార్డు పరిధి ఎక్కువగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయడంతో పరిధి తగ్గింది. దీనివలన కోల్డ్‌స్టోరేజ్‌లు, గోర్రెలమండి, ప్రత్తి, కారం మిల్లులు వంటివి ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి వెళ్లిపోయాయి. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా రైతులు తమ మిర్చిని అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ కారణంగా దాదాపుగా రూ. వెయ్యి కోట్లకు పైగా టర్నోవర్ ఇక్కడ జరుగుతున్నది. మార్కెట్ ఫీజు రూపంలోనే రూ.100 కోట్ల వరకు యార్డుకు ఆదాయం సమకూరుతుంది. దీంతో ఛైర్మన్ పదవికి డిమాండ్ పెద్దగా తగ్గలేదు.

తీవ్రమైన పోటీ...

మిర్చియార్డు ఛైర్మన్ పదవి కోసం తెలుగుదేశం పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ మార్కెట్ కమిటీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉంది. అయితే గుంటూరు తూర్పు నియోజకవర్గం కూడా మిర్చియార్డు కిందకే వస్తుంది. దీని దృష్ట్యా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన నేతకు ఛైర్మన్ గిరిని ఇస్తారా, కేంద్ర మంత్రి ప్రతిపాదించే నాయకుడికి ఇస్తారా అన్నది సస్పెన్స్‌గా మారింది. ఇదే సమయంలో ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా రాష్ట్ర స్థాయిలోనే నిర్ణయం జరిగే అవకాశం కూడా లేకపోలేదు. కమిటీలో వైస్‌ఛైర్మన్, డైరెక్టర్ పోస్టులు కూడా నామినేట్ చేయాల్సి ఉంది. వాటికి మాత్రం స్థానిక నేతలకే అవకాశం కల్పిస్తారు. కమిటీలో టీడీపీతో పాటు జనసేన, బీజేపీకి కూడా అవకాశం ఇస్తారన్న చర్చ కూటమి వర్గాల్లో జరుగుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎవరో?

(5వ పేజీ తరువాయి)

కనబరుస్తున్నారు. ఆలపాటి వర్గీయులు మాత్రం మరింత విశ్వాసంగా గెలుపు తమదేనని ఢంకా బజాయిస్తున్నారు. పోలింగ్ రోజున కూటమి శ్రేణులు రిగ్గింగ్ చేశాయని పీడీఎఫ్ ఆరోపిస్తున్నది. కాగా మొత్తం 3,47,116 మంది ఓటర్లుండగా 2,41,502 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలో 73.30, కృష్ణాలో 69.91, ఎన్‌టీఆర్‌లో 65.69, గుంటూరులో 66.45, బాపట్లలో 74.30, పల్నాడులో 77.33 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 483 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ జరిగింది.

28 టేబుళ్లు.. నిరంతరాయంగా లెక్కింపు

ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితం వెలువడేంత వరకు నిరంతరాయంగా కొనసాగిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఇందుకోసం మూడు షిఫ్టుల్లో 750 మంది సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. పోలింగ్ అయిన ఓట్ల సంఖ్య అధికంగా ఉన్నందున కౌంటింగ్ హాల్‌లో 28 టేబుళ్లని ఏర్పాటు చేశారు. రౌండ్ల వారీగా వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో టేబుల్‌కి పంచి తొలుత తొలి ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 9 నుంచి 10 రౌండ్లలో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. అప్పటికే ఏ అభ్యర్థికి అయినా 50 శాతం కంటే ఒక్క ఓటు అధికంగా వచ్చినా విజేతగా ప్రకటిస్తారు. లేని పక్షంలో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుని అందరికంటే తక్కువగా ఓట్లు పోలింగ్ అయిన అభ్యర్థి నుంచి ప్రారంభిస్తారు. అలా ఒక్కో అభ్యర్థిని కింది నుంచి తీసేస్తూ కౌంటింగ్ ప్రక్రియని ముందుకు తీసుకెళతారు. ఇలా 50 శాతం ఓట్లు దాటే వరకు కొనసాగించి గెలిచిన అభ్యర్థిని ప్రకటిస్తారు. పోలింగ్ అయిన ఓట్లు అధికంగా ఉన్నందున తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే దాదాపుగా ఫలితం వెలువడే అవకాశం ఉందని అందరూ అంచనా వేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆదివారం రాత్రి ఆమె ఏసీ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ హాల్స్‌లో టేబుల్స్ ఏర్పాటు, ఏజంట్ల సీటింగ్, ఫెన్సింగ్, బ్యాలెట్ పేపర్లను కలిపేందుకు ఏర్పాటు చేసిన డ్రమ్ములు తదితర సామగ్రిని పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. అనంతరం కౌంటింగ్ హాల్లో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. గత నెల 27న పోలింగ్ ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలోకి తరలించి భద్రపరిచామన్నారు. పోలింగ్ 69.5 శాతం జరిగినందున దాదాపు 2,41,502 ఓట్లు లెక్కించాల్సి ఉందన్నారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్య ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడు రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా కౌంటింగ్ మొదటి రౌండ్లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకుని మిక్సింగ్ చేస్తారన్నారు. తదుపరి చెల్లుబాటయ్యే ఓట్లను పరిశీలన చేసి మొదటి ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలుపొందినట్లు ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు ఎవరికీ నిర్దేశిత కోట ఓట్లు రాకపోతే తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్య ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామన్నారు. కౌంటింగ్ ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని గుర్తింపు కార్డు లేకుండా ఎవర్నీ కౌంటింగ్ ప్రాంతానికి అనుమతించమన్నారు. లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జేసీ భార్గవతేజ, డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మళ్లీ గంటా 35 నిమిషాలు ఆగిన ప్యాసింజర్ రైలు

- ఆగ్రహించిన ప్రయాణికులు
- ఎండకు తట్టుకోలేక ఆటోలు, బస్సులను ఆశ్రయించిన వైనం



డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

వేమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేమూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం రేపల్లె-గుంటూరు ప్యాసింజర్ రైలు గంట 36 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఉదయం 9.59 నిమిషాలకు రావాల్సిన రైలు 10 గంటలకు వచ్చి సిగ్నల్ ఇవ్వకపోవడంతో స్టేషన్‌లో నిలిచిపోయింది. 11.35 గంటలకు తిరిగి రైలు బయలు దేరింది. గంటా 35 నిమిషాల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆగ్రహించారు. గత సోమవారం కూడా ఇదేవిధంగా ఇదే ప్యాసింజర్ రైలు గంట 22 నిమిషాల పాటు స్టేషన్‌లో ఆగిపోయింది. ఈ సందర్భంలో స్టేషన్ మాస్టర్, ప్రయాణికుల మధ్య వివాదం చోటుచేసుకుంది. తెనాలి-సంగం జాగర్లమూడి స్టేషన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతుల సందర్భంగా రైలు నిలిపి వేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ప్రయాణికులకు స్టేషన్ మాస్టర్‌గానీ లేదా కనీసం మైకు అనౌన్స్‌మెంట్ కూడా చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైలులో కూర్చోలేక, ప్లాట్‌ఫారంపైకి రాలేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. గతవారంలో ఇదే సంఘటనలో ప్రయాణికులు ప్రశ్నించినా, అధికారుల్లో మార్పు రాకపోవడంతో వారి తీరును ఎండగడుతున్నారు. ట్రైన్ ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక చాలామంది వారి ప్రదేశాలకు వెళ్లేందుకు ఆటోలు, బస్సులను ఆశ్రయించారు. ఇకనైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రాక్‌ల మరమ్మతులు పూర్తయ్యే వరకు ఈ మార్గంలో కొన్ని ట్రిపులను నిలిపివేసేలా ఆలోచన చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్

- అదనపు లోడు క్రమబద్ధీకరణకు సదావకాశం
- కిలోవాట్‌కు రూ.2 వేల నుంచి రూ.వెయ్యికి తగ్గింపు
- చెల్లింపులకు జూన్ 30 వరకు అవకాశం

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులకు స్పెషల్ ఆఫర్ ప్రకటించింది. అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు సదావకాశాన్ని కల్పించింది. విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో కంటే ఎక్కువ లోడును వినియోగించుకునే గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే వారికి కిలో వాట్‌కు వెయ్యి వరకు తగ్గింపు కల్పించింది. సాధారణంగా గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో కంటే తరువాత ఇంట్లో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు పెరిగి అదనపు లోడు పెరుగుతోంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై అధికభారం పడుతోంది. ఫలితంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్న ఘటనలు ఉంటున్నాయి. విద్యుత్ సరఫరాలో లోపాలను అధికమించేందుకు గృహ విద్యుత్ వినియోగదారులే స్వచ్ఛందంగా అదనంగా వినియోగిస్తున్న లోడును క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం కిలో వాట్‌కు రూ.2 వేలు అదనంగా సెక్యూరిటీ డిపాజిట్ చార్జీల కింద రూ.200లు కలిపి కిలో వాట్‌కు రూ.2,200 చెల్లించాలి. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వినియోగదారులకు కిలో వాట్‌కు రూ.వెయ్యి, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 కలిపి రూ. 1,200 చెల్లిస్తే సరిపోతుంది. అదనపు లోడు క్రమబద్ధీకరించుకునేందుకు విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల్లో (ఈఆర్‌వో) లేదా మీ సేవా సెంటర్లు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లలో కూడా చెల్లింపులు చేసుకోవచ్చని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

స్వచ్ఛందంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశం మార్చి 1 నుంచి జూన్ 30 వరకు కల్పించినట్లు గుంటూరు సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏవో) పాశం రామిరెడ్డి తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లలో 6,12,294 మంది గృహ విద్యుత్ వినియోగదారులున్నారని తెలిపారు. వారు సంస్థ అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరావు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చెరుకూరి తిరుపతిరావు, పాల్గొన్న బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక లాలుపురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా పరిశీలకుడు శ్రీనివాసరాజు, ఎన్నికల అధికారి చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికై కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, నాయకులు జమ్ముల శ్యామ్‌కిషోర్, నేరెళ్ల మాధవరావు, కొత్తూరి వెంకటసుబ్బారావు, మకుటం శివ, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి తదితరులు తిరుపతిరావును అభినందించారు.

పాఠశాలలకు మళ్లీ పూర్వ స్థితి



తెనాలి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధానాలతో భ్రష్టుపట్టిన ప్రాథమిక పాఠశాలలను కూటమి ప్రభుత్వం చక్కదిద్దుతోంది. జీవో 117 రద్దు చేసి మళ్లీ ప్రాథమిక పాఠశాలలకు జీవం పోసే దిశగా విద్యాశాఖ వ్యవహరిస్తోంది. ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ఎలా ఉండాలనే అంశాన్ని తల్లిదండ్రుల నిర్ణయం మేరకే అమలు చేసే దిశగా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాలతో తరచూ సమావేశాలు నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రాథమిక విద్యా వ్యవస్థను చక్కదిద్దాలని ఆదేశించారు. గత ప్రభుత్వం జీవో 117తో ప్రాథమిక పాఠశాలల 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. దీంతో ఇంటికి దగ్గరగా ఉన్న పాఠశాల దూరం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల వాహనాలు ఎక్కించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే మిగలడంతో విద్యార్థుల సంఖ్య పదిలోపునకు చేరడం, పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగలడంతో ప్రాథమిక విద్యారంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యా రంగాన్ని చక్కదిద్దేందుకు నడుం కట్టింది.

జీవో 117 రద్దు చేసి..

జీవో 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న ప్రాథమిక విద్యార్థులకు తిరిగి వెనక్కి పంపేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామంలోనూ ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి ఐదు తరగతి గదులు, ఐదుగురు ఉపాధ్యాయులతో మెరుగైన బోధన అందించాలని భావిస్తోంది. దీంతోపాటు ఏ ఒక్క పాఠశాల మూత పడకుండా ఉండేందుకు ఆయా గ్రామాల్లో 1, 2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలలు, ఐదు తరగతులు ఉండేలా బేసిక్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. అయితే ఈ విధానం కూడా తమకు దగ్గరగా ఉన్న పాఠశాలను దూరం చేస్తుందనే ఆలోచన తల్లిదండ్రుల్లో వ్యక్తం కావడంతో పాఠశాలలో విద్యా కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిదండ్రుల నిర్ణయాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశించింది.

తల్లిదండ్రుల కమిటీల తీర్మానాల మేరకు..

ఈ మేరకు పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు పరిస్థితిని వారి ముందు ఉంచారు. ఎక్కువ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమకు దగ్గరగా ఐదు తరగతులు నుంచే బేసిక్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకే మొగ్గు చూపుతూ తీర్మానాలు చేశారు. ప్రతి మండలంలో కూడా అధిక సంఖ్యలో ఈ విధానం ఏర్పాటుకు తీర్మానాలు చేసి ఆయా మండలాల విద్యాశాఖాధికారులకు అందించారు. ఈ నిర్ణయాలను ప్రతి మండలంలో ఎంఈవోలు రాష్ట్ర విద్యాశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. బేసిక్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు ద్వారా గత పాత విధానాన్ని తిరిగి ప్రాథమిక విద్యా రంగంలో నెలకొంటుంది. దీంతో ప్రతి పాఠశాల పిల్లలకు దగ్గరగా ఉండటమే కాకుండా తగిన సంఖ్యలో విద్యార్థులు, టీచర్లు ఉండే అవకాశం ఉందనీ, ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని పలువురు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రాథమిక విద్యా రంగాన్ని చక్కదిద్దుతున్న కూటమి ప్రభుత్వం నిర్ణయాల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలోని చిలుమూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తెల్ల పంచె, తెల్ల చొక్కా ధరించిన 70 సంవత్సరాల వృద్ధుడు ఎదురుగా వస్తున్న రైలును గుర్తించక పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బైకు అదుపుతప్పి..

చెరుకుపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పొన్నపల్లికి చెందిన అట్ల బ్రహ్మారెడ్డి, వారే నాగార్జున్‌రెడ్డి చెరుకుపల్లి నుంచి పొన్నపల్లి వెళ్తుండగా పొన్నపల్లిలోని మేరీరోజ్ బడ్స్ స్కూల్ ఎదురుగా అదుపు తప్పిన బైకు డివైడర్‌ను ఢీకొనడంతో బ్రహ్మారెడ్డి మృతి చెందాడు. నాగార్జున్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



యేల్చూరిని సత్కరిస్తున్న పెమ్మసాని, నసీర్, డేగల, కాంతారావు తదితరులు

చిరు వ్యాపారులకు 'ఛాంబర్' అండగా నిలవాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

● ఘనంగా యేల్చూరి వెంకటేశ్వర్లు ఆత్మీయ సత్కారం

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వెన్నుదన్నుగా నిలవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఆదివారం ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గుంటూరుకు నూతనంగా ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లుకు ఆత్మీయసత్కారం జరిగింది. సభను ఛాంబర్ పూర్వ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు నిర్వహించగా, సభకు ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి కాంతారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలపై ఎమ్మెల్యేల దృష్టికి లేదా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రంధి కాంతారావు మాట్లాడుతూ యేల్చూరు సమర్థతతో ఛాంబర్ సభ్యత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. ఛాంబర్ ఎన్నికలు ప్రతి ఐదేళ్లకు ఒక సారి నిర్వహించాలే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఛాంబర్ సభ్యుల సమిష్టి కృషితో సేవలను మరింత విస్తృతం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ల చైర్మన్‌లు డేగల ప్రభాకర్, మన్నవ మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రజలకు మేలు చేసేలా అధికారులు పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాలనలో కీలకమైన పాత్ర పోషించాల్సిన ఉన్నతాధికారులు ప్రజల మేలు కోసం పనిచేయాలని, అలా చేయడం ఇష్టం లేనివారు తమ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంట్రాక్ట్‌లు చేసుకోవాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలోనే పవన్‌కల్యాణ్ అధికారులు తీరుమార్చుకోవాలని సూచించారని, అయినా కొందరు అధికారుల తీరులో మార్పు రావడంలేదన్నారు. ఏపీ ఎస్ఎఫ్‌సీ కార్పొరేషన్‌లో అక్రమ నియామకాలు జరిగాయని, అవసరం లేని ఉద్యోగులకు ప్రతి నెలా రూ.4కోట్ల వేతనం చెల్లిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ సదుద్దేశంతో ఏర్పాటుచేసుకున్న కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసేలా అధికారులు ప్రవర్తించడం దారుణమన్నారు. ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు శిఖా బాలు, అడపా మాణిక్యాలరావు, చట్టాల త్రినాథ్, మధులాల్, కొచ్చెర్ల తారక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణతులసీ నగర్, అభయాంజనేయ కళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతీ సమితి, విజయవాడ వారి సౌజన్యంతో ఆదివారం రామాంజనేయయుద్ధంలోని యుద్ధ ఘట్టం, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించారు. కళాకారులు పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర్శన చేసి నాటకాభిమానులను ఆకట్టుకున్నారు. హార్మోనియంపై ఎన్ సిద్ధయ్య, డోలక్‌పై ఎం రామాంజనేయులు, క్లారినెట్‌పై షేక్ నబి వాద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో అతిధులుగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, టీడీపీ నాయకులు బూరి సురేష్ తదితరులు కళాకారులను సత్కరించారు.

వైభవంగా ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, శ్రీ మారుతీ దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిధిగా శ్రీశృంగేరి విరూపాక్ష పీఠాధిపతి శ్రీగంభీరానంద భారతిస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత గణపతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాలకమండలి సభ్యులు కొరపాటి రామారావు, సురేష్‌రెడ్డి పాల్గొనగా, కార్యక్రమాల్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఊపిరితిత్తుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ ఎస్ రఘు

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్ రఘు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఊపిరితిత్తుల సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆదివారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ధూమపానం, మద్యపానంతోపాటు పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కూడా ఊపిరితిత్తుల అనారోగ్యానికి ముఖ్య కారణాలని చెప్పారు. గాలి ద్వారానే ఊపిరితిత్తులకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. నెమ్ము సమస్య గురించి తెలియజేస్తూ ఈ సమస్యకు నిమోనోకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని 60 సంవత్సరాల లోపువారు ఈ వ్యాక్సిన్ రెండు పర్యాయాలు తీసుకోవాలని, 60 సంవత్సరాలు పైబడినవారు ఒక డోస్ తీసుకుంటే సరిపోతుందన్నారు. సభలో టీవీ సాయిరాం, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ముప్పాళ్ళ ప్రసాదరావు, ఎన్ సాంబశివరావు, పాముల రెడ్డి, ఆర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో పెన్షన్ కోర్టును ఏర్పాటు చేయాలి

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పెన్షన్ కోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర గవర్నర్‌కు రాసిన లేఖలో పెన్షన్‌దారుల చర్చావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వేలాదిమంది పెన్షనర్లు రకరకాల పెన్షన్ సమస్యలతో ఇక్కట్లుకు గురవుతున్న పరిస్థితిని అనేక సంఘాలు అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్ళగా పెన్షనర్ల సమస్యల పరిష్కారాల నిమిత్తం వారి సౌకర్యం కోసం శాశ్వతంగా కొనసాగే ఏర్పాటుతో పెన్షన్‌దారుల కోర్టు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ కోర్టును అప్పటి హైకోర్టు ప్రధానన్యాయమూర్తి సత్యబ్రతసిన్హా 2001లో ప్రారంభించారన్నారు. ప్రతి నెలా శనివారంలో మూడు సిట్టింగ్‌లు ఈ కోర్టు నిర్వహిస్తుందన్నారు. ఈ కోర్టు ద్వారా పెన్షన్ సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం ఏర్పడిందని తెలిపారు. గత 15 సంవత్సరాల కాలంలో ఎన్నో కేసులు పరిష్కారమై పెన్షనర్లకు రావాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్ తదితర లాభాల బకాయిలతో కోట్లాది రూపాయలు చెల్లించటం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కూడా హైదరాబాదులోనే ఈ కోర్టు ఉండటంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన పెన్షన్ కేసులన్నీ అక్కడికే రిఫర్ చేస్తున్నారన్నారు. దీనివల్ల కాలయాపన జరిగి పెన్షనర్లు పలు ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో పెన్షన్ కోర్టును అమరావతిలో ఏర్పాటుచేసి ప్రత్యేక జడ్జిని నియమించి పెన్షనర్ల సమస్యల పరిష్కారం వేగంగా జరిగేందుకు రాష్ట్ర గవర్నర్ చర్యలు తీసుకోవాలని వీరయ్య విజ్ఞప్తి చేశారు.



అంతర్గత నూతన తారురోడ్డు (ఇన్‌సెట్లో దాత శరత్‌చంద్ర)

వెల్లివిరిసిన నందనవనం!

● ఆహ్లాదం పంచుతున్న ఉద్యానవనం

● వైద్య కళాశాలలో సుందరీకరణ పనులు

● చేయూతనిస్తున్న పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్ చేసిన పూర్వ విదార్థులు తమ మాతృ విద్యా సంస్థ రుణం కొంతైనా తీర్చుకొనేందుకు ముందుకు వస్తున్నారు. కళాశాలలో సుందరీకరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తున్నారు. పూర్వ విద్యార్థులు అందించిన సుమారు రూ.10 లక్షల వ్యయంతో కళాశాల ఉద్యానవనానికి కొత్త రూపు తెచ్చారు. గుంటూరు వైద్య కళాశాలలో ప్రవేశించగానే అందరినీ ఆకట్టుకునేది సర్క్యులేటింగ్ ఏరియాలో ఉన్న ఉద్యానవనం. ప్రస్తుతం పూర్వ విద్యార్థులు చేయూతతో ఉద్యాన వనం... సుందర నందనవనంగా మారింది. గార్డెన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయించి పచ్చటి లాన్‌ను తయారుచేశారు. లాన్‌లో విద్యార్థులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించారు. అంతర్గత తారు రోడ్లను కొత్తగా ఏర్పాటు చేయించారు. ఉద్యానవనంలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, ధన్వంతరి, హానిమన్, అట్లాస్ వంటి విగ్రహాలకు కొత్తగా ఎనామిల్ రంగులు వేయించారు. ఎన్నో ఏళ్ల కిందట నిలిచిపోయిన గార్డెన్‌లో ఫౌంటెయిన్‌ను పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆవరణ ప్రవేశ మార్గం దగ్గర ఐ లవ్ జీఎంసీ అనే లైటింగ్ బోర్డును ఏర్పాటు చేయించారు. దీంతో జీఎంసీ గార్డెన్ కొత్త రూపు సంతరించుకొని ఆకర్షణీయంగా మారింది.



ఉల్లాసం కలిగించే ఫౌంటేన్

అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత...

వైద్య కళాశాల ఉద్యానవనం అభివృద్ధిని దాతల సహకారంతో చేయడం విశేషం. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వైవీకే దుర్గాప్రసాద్, డాక్టర్ శైలజా దంపతులు గార్డెన్ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఎస్పీఎం విభాగం ఎదుట ఉన్న లాన్ అభివృద్ధికి జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి రూ.లక్ష విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్త కాకుమాను శ్రీనివాసరావు, నగరానికి చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ శివరామకృష్ణ గార్డెన్ అభివృద్ధికి తమ వంతు విరాళం అందజేశారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ నూతక్కి శ్రీధరరావు గార్డెన్‌లో వైద్య విద్యార్థులు సేదదీరేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించారు. కళాశాలలో అంతర్గత తారు రోడ్ నిర్మాణానికి న్యూరాలజిస్ట్ డాక్టర్ నల్లబోతు శరత్‌చంద్రకుమార్ రూ.6 లక్షల విరాళం అందజేశారు. దీంతో చాలా సంవత్సరాల తర్వాత కళాశాల లోపల కొత్త రోడ్లు ఏర్పాటు అయ్యాయి. జీఎంసీ బయట ప్రవేశ ద్వారం ఇరు పక్కలా గోల్డెన్ లెటర్స్‌తో గుంటూరు వైద్య కళాశాల పేరును తెలుగు, ఆంగ్ల భాషల్లో ఏర్పాటు చేయించారు.



లాన్‌లో పరుచుకున్న పచ్చదనం

నూరు శాతం ఆస్తి పన్ను వసూలు జరగాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను నూరుశాతం వసూలు జరగాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి నెల ప్రారంభమైనందున రెవెన్యూ విభాగ ప్రతి అధికారి పన్నువసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్ను బకాయి ఉన్న ప్రైవేట్ ఆస్తుల్లో రూ.165 కోట్లకు ఇప్పటివరకు రూ.90 కోట్లు వసూళ్లు జరిగిందని, మార్చి చివరికి మరో రూ.50 కోట్లు వసూలు చేయాలన్నారు. పన్నువసూళ్లకు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకు తగినవిధంగా క్షేత్రస్థాయిలో వసూళ్లు జరగాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నవాటికి డిప్యూటీ కమిషనర్లు బాధ్యత తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీస్థల, నీటి కుళాయి చార్జీలను సకాలంలో చెల్లించాలని, తద్వారా నగరంలో అభివృద్ధికి వీలు కల్గుతుందన్నారు. ఏప్రిల్ 1 నుండి పన్నుపై రూ.2 వడ్డీ జమ అవుతుందన్నారు. మార్చి నెలలో సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని, పన్నులను జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు భారత్‌పేటలోని 140 సచివాలయం క్యాష్‌కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు.

భాష, సాహిత్య, సాంస్కృతిక విధానాలతో సమాజంలో చైతన్యం

● తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న జూలూరి గౌరీశంకర్, పాల్గొన్న మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని గాడిలో పెట్టే శక్తిసామర్థ్యాలు సాహిత్య, సాంస్కృతిక రంగాలకే ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక రెడ్డిపాలెం ఇన్నర్‌రింగ్ రోడ్డు, శ్రీరామ ధామం ఆవరణలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. సభను మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించగా, సభకు ముప్పావు చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఎంపీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గౌరీశంకర్ మాట్లాడుతూ మాతృభాషను విస్మరించిన సమాజానికి మనుగడ ఉండదని, తల్లి భాష పరిరక్షణ విషయంలో తమిళులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పాలకులు తమ అధికారం కోసం మూఢనమ్మకాలను అశాస్త్రీయ భావాలను ప్రోత్సహించటం మంచిది కాదన్నారు. మార్కెట్ విష సంస్కృతిపై యుద్ధం చేస్తున్న పెనుగొండను సమాజమే సగర్వంగా అభినందిస్తుందన్నారు. రాయలసీమ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పెనుగొండను నిజమైన అభ్యుదయ కార్యకర్తగా అభివర్ణించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మార్క్సిజం ప్రేరణతో సుదీర్ఘకాలంగా అభ్యుదయ రచయితల సంఘం బాధ్యతలను ఇష్టంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. తాను అందుకోబోతున్న అవార్డు 'అరసం'కే దక్కుతుందని తెలిపారు. అనంతరం పెనుగొండ లక్ష్మీనారాయణను మోదుగుల వేణుగోపాలరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. సభలో ప్రొఫెసర్ సుశీలమ్మ, ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా జూన్‌లో ఛలో రాజధానికి పిలుపు

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కి వ్యతిరేకంగా మాలమహానాడు, మాలమహాసభ ఆధ్వర్యంలో జూన్‌లో హలో మాల ఛలో రాజధాని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, మాలమహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలు పునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామన్నారు. ఇదే విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామన్నారు. అయినప్పటికీ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ జూన్‌లో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

● 13మంది జూదరుల అరెస్టు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్‌కి పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేంద్ర నగర్ మొదటి లైనులో గల ఒక అపార్ట్‌మెంట్‌లోని ప్లాటులో పేకాట ఆడుతున్నారనే సమాచారం వచ్చింది. ఈ మేరకు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్సై నరహరి, పోలీస్ సిబ్బందితో కలిసి రైడ్ చేసి, అక్కడ పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.54 వేల 100 నగదును సీజ్ చేశారు. వారిని తదుపరి దర్యాప్తు నిమిత్తం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు. వెస్ట్ పోలీస్ సబ్-డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, బహిరంగ మద్యపానం చేసినా, ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా రోడ్ల పైన బైక్ రేస్ చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

వైభవంగా మహా కుంభాభిషేక మహోత్సవాలు



అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి, పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. టీటీడీ ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఉభయ దేవి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు నగరోత్సవం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. భీమవరానికి చెందిన త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి, ప్రముఖ సాహితీవేత్త మల్లాది కైలాసనాథ్ బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేక విశిష్టతను వివరించారు. సభలో అతిథులుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు ప్రసంగించారు.

పూజల పేరుతో ఘరానా మోసం

● అమ్మవారి అనుగ్రహం పేరిట రూ.15 లక్షలు వసూలు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పూజల పేరుతో ఓ కుటుంబాన్ని రూ.15 లక్షలకు మోసగించిన ఓ మహిళ ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేశ్వరరావు కాలనీ 2వ లైన్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి మన్నెం నాగేశ్వరరావుకు ఆయన మరదలు గుడిపల్లి భారతి ద్వారా నరసరావుపేట మండలం కేశానుపల్లికి చెందిన బొమ్మనబోయిన వెంకాయమ్మ అలియాస్ నాగమణి పరిచయమైంది. ఆమె తన వద్ద 100 కోట్లు నగదు ఉన్నట్లు చెప్పుకుంది. దీంతో భారతితో కలిసి నాగేశ్వరరావు భార్య నాగేంద్రం కేసానుపల్లి వెళ్ళి వెంకాయమ్మను కలిసి తాము చాలా ఇబ్బందులలో ఉన్నాం సహాయం చేయమని కోరారు. ఒక రోజు వెంకాయమ్మ, నాగేశ్వరరావు ఇంటికి వచ్చి, మీ ఇంట్లో అమ్మవారి అనుగ్రహం ఉన్నది.. రూ.5 లక్షలు కాదు, అమ్మవారు ఇచ్చిన నాగమణి ఉన్న ఒక మూట ఇస్తానని చెప్పింది. అయితే ఆ మూటకు లక్ష రూపాయలతో పూజ చేయించాలని చెప్పింది. దీంతో నాగేశ్వరరావు భార్య వెంకాయమ్మకు విడతల వారీగా రూ.2 లక్షలు ఇచ్చారు. మరికొన్ని పూజలు చేయాలి.. లేదంటే ఇంట్లో ఒకరికి ప్రాణ గండం అని ఓ సిద్ధాంతితో చెప్పించి భయపెట్టి రూ.10 లక్షలు వసూలు చేసింది. భారతి కూడా ఐదు లక్షలు ఇచ్చింది. ఎంతకీ వెంకాయమ్మ డబ్బులు ఉన్న మూట ఇవ్వకపోవడంతో తామిచ్చిన రూ.15 లక్షలు ఇవ్వమని ఆమెపై ఒత్తిడి తీసుకువచ్చారు. తమ తల్లికి పిచ్చి పట్టిందని, కావాలంటే పోలీస్ కేసు పెట్టుకోండి, మీరు మమ్మల్ని ఏమి చేయలేరు.. డబ్బులు అడిగితే చంపుతామని ఆమె కుమార్తెలు, కుమారులు నాగేశ్వరరావును బెదిరించారు. రూ.15 లక్షలు తీసుకున్న వెంకాయమ్మ, ఆమె కుమారులు వెంకయ్య, గోపి, కుమార్తెలు పూర్ణ, లక్ష్మి, ఆమె డ్రైవరు కత్తి మహేష్, సిద్ధాంతి తదితరులపై నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్వోబీ పనులు వేగవంతం చేయండి



మూడు వంతెనల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగంగా పూర్తిచేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని మూడు వంతెనల నిర్మాణ పనులు ఆదివారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. గుంటూరు సమగ్రాభివృద్ధికి ప్రణాళికాయుతంగా పని చేస్తున్నామని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపడుతున్నామని తెలిపారు. నగరంలో ఆర్వోబీల నిర్మాణ పనులు పూర్తయితే గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఘనంగా సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 69వ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని చుట్టుగుంట సెంటర్‌లో సంస్థ గోడౌన్లలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆ సంస్థ మేనేజర్ ఎన్ వెంకటరమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగించారు. సీడబ్ల్యూసీ అనేది ఆహార ధాన్యాలను నిల్వ చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంస్థ అని చెప్పారు. వీటివలన ఎంతోమందికి ఉపాధి లభిస్తున్నదన్నారు. కార్యక్రమంలో పీ రాజారావు, విజయ్‌సింగ్, కే వీరాస్వామి, ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ వీ వెంకటసాహితి, డిపాజిటర్లు ఆర్‌సీఎఫ్, ఇఫ్కో, సీసీఐతో పాటు రైతులు, హమాలీలు, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు

● నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ

● గ్రాండ్ టెస్టులకు విస్తృత ఏర్పాట్లు: డీఈవో సీవీ రేణుక



సీవీ రేణుక, డీఈవో, గుంటూరు

గుంటూరు(విద్య), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే దాదాపు మూడు నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల్ని పరీక్షలకు ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వారాంతంలో విద్యార్థులకు మోడల్ పేపర్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు. మరోవైపు విద్యార్థులకు ఇటీవల స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

భయాన్ని తొలగించేలా పరీక్షల నిర్వహణ

జిల్లాలో పది విద్యార్థులకు సోమవారం నుంచి 13వ తేదీ వరకు గ్రాండ్‌టెస్టులు నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షల్ని పబ్లిక్ పరీక్షల తరహాలో నిర్వహించి విద్యార్థులకు పరీక్షలంటే భయం తొలగించేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది పది పరీక్షలకు 30,460 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారు. వారి కోసం ఇప్పటికే 150 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణపై ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో సీవీ రేణుక శుక్రవారం సీఎస్, డీవోలతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. గ్రాండ్ టెస్టుల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. పరీక్షలంటే విద్యార్థులకు ఉన్న భయం తొలగించడానికి గ్రాండ్ టెస్టులు ఉపయోగపడతాయని, ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల్ని ఫైనల్ పరీక్షలకు సన్నద్ధం చేస్తామని తెలిపారు. ప్రశ్నా పత్రాలు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు నుంచి పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఉచిత వినికిడి వైద్య శిబిరం

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొరిటపాడు వాకింగ్ ట్రాక్‌లో ఉచిత వినికిడి వైద్య శిబిరం జరిగింది. స్థానికులకు వైద్యులు పరీక్షలు జరిపి, తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ అధ్యక్షుడు ఆదిశేష పరిశె మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ మోతాదుకు మించి శబ్దాలు వినడం ద్వారా వినికిడి లోపం పెరుగుతుందని చెప్పారు. వినికిడి లోపం అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి సరైన సమయంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రెటరీ భీమినేని సుధీర్, బాబు, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రేమ్ కుమార్, కొరిటపాడు వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్ కన్నసాని బాజీ, ఏవీ రమణ, పడమట నాగేశ్వరరావు, సత్యనారాయణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న శోభాయాత్ర

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని ఏప్రిల్ 6న నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు హరిహర రాయల్ తెలిపారు. ఆదివారం పండరీపురంలో శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. శోభాయాత్ర సాయంత్రం 3.30 గంటలకు స్థానిక బృందావన్‌గార్డెన్స్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమై సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్రం వద్ద ముగుస్తుందని తెలిపారు. యాత్రలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, చెరుకూరి తిరపతిరావు, కొత్తూరి సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, కమిటీ నిర్వహణ సభ్యులు లక్ష్మణ్, గాయత్రి బెహరా, అనిల్ బెహరా, కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న శోభాయాత్ర కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు

గ్రాడ్యుయేషన్ వరకు మన దేశంలో చదివినా, ఉన్నత విద్య మాత్రం విదేశాల్లో చదువుకుని కెరీర్‌లో గొప్పగా స్థిరపడాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. దీని వల్ల చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. కొత్త సంస్కృతులు పరిచయం అవుతాయి, కెరీర్ అవకాశాలు పెరుగుతాయి, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయి. అందుకే మన దేశంలో ప్రతీ సంవత్సరం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవుతోంది. అయితే ఉన్నత విద్యకు ఏయే దేశాలు- యూనివర్సిటీలు మంచివి, ఎంత ఖర్చు అవుతుంది, వీసా కోసం ఏయే పత్రాలు అవసరం అవుతాయి, ప్రాసెసింగ్ ఎలా చేయించుకోవాలి అనే విషయం చాలా మందికి అవగాహన ఉండదు. విదేశీ విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సహకరించడానికి మన దగ్గర ఫారెన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. వీటిని సంప్రదిస్తే సరైన గైడెన్స్ లభిస్తుంది. తరువాత సులువుగా కావాల్సిన డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవచ్చు.

కొవిడ్ ముందుతో పోలిస్తే తరువాత విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సంలో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుకున్న విద్యార్థుల సంఖ్య 8,94,783. ప్రపంచ వ్యాప్తంగా చైనా తరువాత ఉన్నత విద్య కోసం అత్యధికంగా విదేశాలకు వెళుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మన విద్యార్థుల ప్రాధాన్యంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకేలు వరుసగా ఉన్నాయి. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ నివేదిక ప్రకారం 2023-24 అకడమిక్ ఇయర్‌లో అమెరికాకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 3,37,630. అయితే కెనడా ఇబ్బందుల కారణంగా ఈ విద్యా సంవత్సరం అక్కడికి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు వెళుతున్న విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న కన్సల్టెన్సీల సేవల పొందుతున్నారు. భారతదేశంలో పేరున్న కన్సల్టెన్సీల్లో ఇవికొన్ని...

విదేశీ విద్యకి బెస్ట్ కన్సల్టెన్సీలు

ఐడీపీ ఎడ్యుకేషన్

ఐదు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సర్వీసులో ఉన్న పెద్ద సంస్థ ఇది. ఆస్ట్రేలియన్ ఆసియన్ యూనివర్సిటీస్ కో-ఆపరేషన్‌గా మొదలై కాలక్రమంలో 'ఐడీపీ ఎడ్యుకేషన్' పేరు మార్చుకుంది. విదేశీ విద్యకు సంబంధించి పలు సేవలు అందిస్తుంది. www.idp.com/india/

ఇన్ఫినిటీ గ్రూప్

ఇన్ఫినిటీ గ్రూప్ రెండు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. ఈ సెక్టార్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఇన్ఫినిటీ'కి 300 యూనివర్సిటీ పార్టనర్‌షిప్, 2500 గ్లోబల్ పార్ట్‌నర్స్ ఉన్నారు. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్, ఎండ్ టు ఎండ్ అసిస్టెన్స్‌లో ఉంటుంది. https://infinitegroup.global/



వై యాక్సిస్

భారతదేశంలోని పేరొందిన నమ్మకమైన స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీల్లో 'వై యాక్సిస్' ఒకటి. 25 సంవత్సరాల పైన ఈ సంస్థ కన్సల్టెన్సీ సర్వీసులో ఉంది. స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కౌన్సెలింగ్, వీసా అసిస్టెన్స్, కెరీర్ కౌన్సెలింగ్, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో 'వై యాక్సిస్' సహాయం చేస్తుంది. https://www.yaxis.com/

ఎడ్వైజ్ ఇంటర్నేషనల్

'ఎడ్వైజ్ ఇంటర్నేషనల్' మూడు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. దేశంలోని పాత కన్సల్టెన్సీల్లో ఇది ఒకటి. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రి డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. స్కాలర్‌షిప్స్, ఫైనాన్సియల్ ఎయిడ్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇస్తుంది. https://www.edwiseinternational.com/

'మాన్య గ్రూప్'(ద ప్రిన్స్‌టన్ రివ్యూ ఇండియా)

దేశంలోని ఎస్టాబ్లిష్డ్ కన్సల్టెన్సీల్లో 'మాన్య గ్రూప్' ఒకటి. రెండు దశాబ్దాలకు పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో రెప్యూటెడ్ గ్రూప్ ఇది. పలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, సంస్థలతో పార్టనర్‌షిప్ కొనసాగిస్తోంది. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, శాట్/ఏసీటీ/జీఆర్‌ఈ/జీమాట్/ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ ప్రిపరేషన్, లాంగ్వేజ్ ట్రైనింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు నిర్వహిస్తుంది. https://www.manya-group.com/

కెరీర్ మ్యాట్రిక్స్

ఒకటిన్నర దశాబ్దం పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో ఉన్న సంస్థ ఇది. పలు యూనివర్సిటీలు, సంస్థలతో పార్టనర్‌షిప్ ఉంది స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. https://careermatrix.in/

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోసం 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'



నాలుగు సంవత్సరాల 'ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్'లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025' పేరిట జరిగే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది.. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 64 విద్యా సంస్థల్లోని 6,100 సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. పరీక్షల్లో ర్యాంకు ఆధారంగా ఆయా సంస్థలు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించి బీఏ-బీఈడీ, బీకాం-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తాయి. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను అడుగుతారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు 13 భాషల్లో జరుగుతుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16 **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులో యోగా, వ్యాయమ విద్య, ఆర్ట్స్, సంస్కృతం ప్రవేశపెట్టనున్నారు. ఇవి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఏ కోర్సులోనైనా విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి అన్న నిబంధన ఉండేది. ఇక దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుంచి 80 శాతానికి పెంచనున్నారు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ పూర్తి వివరాలకు exams.nta.ac.in/NCET/ వెబ్‌సైట్ చూడవచ్చు.

దిక్సూచి DIKSUCHI

1161 కానిస్టేబుల్/ ట్రేడ్స్‌మన్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో వివిధ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న 1161 కానిస్టేబుల్ ట్రేడ్స్‌మన్ పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 3. నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఖాళీల్లో 493 కానిస్టేబుల్/కుక్, కానిస్టేబుల్/వాషర్‌మన్ 262, కానిస్టేబుల్ బార్బర్ 199, కానిస్టేబుల్/స్వీపర్ 152, కానిస్టేబుల్/కార్పెంటర్ 9, కానిస్టేబుల్/టైలర్ 23 మొదలైన 13 రకాల పోస్టులు ఉన్నాయి. ఫిజికల్ స్టాండెడ్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 2025 ఆగస్ట్1వ తేదీ నాటికి 18 నుంచి 23 సంవత్సరాల వయస్సులో ఉండాలి. 2025 మార్చి 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలు

1124 కానిస్టేబుల్/ డ్రైవర్

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులతో నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో 845 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులు, కానిస్టేబుల్/ డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ పోస్టులు 279 ఉన్నాయి. పదో తరగతితోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 4. దరఖాస్తు దాఖలు చివరి తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 21 నుంచి 27 మధ్యలో ఉండాలి. రెండు పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://cisfrectt.cisf.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

J N Tata Endowment Loan Scholarship

Description: The J N Tata Endowment (J N Tata Endowment Loan Scholarship for Fall 2025 to Spring 2026) invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India.

- Candidates must be interested in pursuing Post - graduate/Doctoral/Postdoctoral studies abroad.
- The course for which candidates are admitted must be recognized as a Graduate Program (post-graduate in Indian terminology).
- Candidates who did not get selected in the previous year/earlier for the J N Tata Endowment loan scholarship and candidates who could not avail of the loan scholarship when they were selected, are eligible to apply afresh.
- Candidates who are already pursuing post-graduate studies overseas may apply either at the end of their 1 st of studies or at the commencement of the 2 nd year, provided there is a minimum of one full academic year (12 months) remaining to be completed at the time of the loan scholarship award, typically in July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or post-graduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2025.

Prizes & Rewards: Loan scholarship of upto Rs. 10 lakhs

Last Date: 07-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/JNT9

SCHOLARSHIP ALERT

NIT Rourkela Summer Internship

Description: The NIT Rourkela Summer Internship Programme 2025 is available for students pursuing undergraduation and master's degrees at the National Institute of Technology, Rourkela. It encourages students to undertake innovative research and development projects.

Eligibility: Applicants must be pursuing one of the following: B.E./B.Tech (4th semester exam completed), B.Arch/Integrated M.Sc./M.Tech/Dual degree (6th semester exam completed), or M.Sc./MA/MBA (2nd semester exam completed). A good academic record and marks/grade sheets of previous semesters shall be required. Applicants must remain available for internship from May 16 to July 15, 2025.

Prizes & Rewards: 7,500 per month and other benefits. ***Last Date:*** 10-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/NRSI1

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సినిమాలు తీయడం కంటే ఐఏఎస్ సాధించడం సులువు



- సందీప్‌రెడ్డి వంగా

ప్రభాస్‌తో తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం 'బాహుబలి' కలెక్షన్లను దాటి రూ.2000 కోట్ల వసూళ్లు సంపాదిస్తుందా లేదా అనేది నేను చెప్పలేను. కానీ ఓ వైవిధ్యమైన చిత్రాన్ని మాత్రం ప్రేక్షకులకు అందిస్తాను అని సందీప్ రెడ్డి వంగా అన్నారు. ఇటీవలె 'గేమ్ చేంజర్స్' అనే షోలో ఆయన పాల్గొన్నారు. ఇందులో పలు విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే, తన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాపై గతంలో మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి చేసిన విమర్శలను సందీప్ గుర్తుచేసుకున్నారు. "ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు నాకింకా గుర్తున్నాయి. ఇలాంటి సినిమాలు తెరకెక్కించకూడదన్నది ఆయన ఉద్దేశం. 'యానిమల్' సమాజాన్ని పదేళ్లు వెనక్కితీసుకెళ్తుందని ఆయన విమర్శించారు. అవి నన్ను చాలా బాధించాయి. నేనేదో నేరం చేసినట్లు అనిపించింది. ఆయన అనవసరంగా నా సినిమాపై అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అనిపించింది. ఓ ఐఏఎస్ అధికారి కావాలంటే కోచింగ్ సెంటర్లకు వెళ్లి, కొన్నేళ్లపాటు శిక్షణ తీసుకుంటూ కష్టపడి చదివితే సరిపోతుంది. కానీ ఓ ఫిల్మ్‌మేకర్ లేదా రచయిత కావాలనుకుంటే సరైన మార్గదర్శకాలు ఇచ్చే టీచర్లు, కోర్సులు ఉండవు. ఓ ఫిల్మ్‌మేకర్ తనకు తానుగా అన్నీ నేర్చుకోవాలి. తన తపన, ఆసక్తి, అభిరుచి, కష్టంతోనే ముందుకు సాగాలి. ఈ విషయాన్ని కావాలంటే నేను పేపర్‌పై కూడా రాసి ఇస్తాను" అని పేర్కొన్నారు. కాగా, 'ట్వల్త్ ఫెయిల్' సినిమాలో కీలక పాత్రలో నటించారు మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంలో 'ట్వల్త్ ఫెయిల్' లాంటి సినిమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయనీ, 'యానిమల్' సినిమాలో సామాజిక విలువలు లోపించాయని విమర్శించారు.

కథ చెబితే బహుమానం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ హీరో, హీరోయిన్లుగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ రుబా'. సారెగమ సంస్థ, రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మాతలు. హోలీ పండుగ సందర్భంగా మార్చి 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఓ పోటీని ప్రకటించారు హీరో కిరణ్ అబ్బవరం.' దిల్ రూబా' చిత్రం కథను ముందుగానే ఊహించి చెప్పిన వాళ్లకు ఈ సినిమాలో హీరో నడిపిన ద్విచక్ర వాహనం బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజేతకు ఈ బహుమతిని అందజేస్తారు.



స్మగ్లర్లలను హీరోలుగా చూపడం సరికాదు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'పాత సినిమాల్లో చివరకు హీరో చేతిలో విలన్ అంతమయ్యేవాడు. లేదంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లేవాడు. ఇప్పుడు నెగిటివ్ క్యారెక్టర్‌లను సైతం హీరోలుగా చూపిస్తున్నారు. స్మగ్లర్‌లు, దేశ ద్రోహులకు హీరోయిజాన్ని ఆపాదించడం సరికాదు. ఆ పాత్రల్లో హీరోలు గొప్పగా నటించినంత మాత్రాన వాటిని ఆదర్శంగా చూపించడం సమంజసం కాదు. ఈ తరం అర్థవంతమైన సినిమాలు తీయాలి. ప్రమాణాలు పాటించాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సీనియర్ నటి కృష్ణవేణి సంస్మరణ సభను ఫిల్మ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. చలన చిత్ర నటిగా, నిర్మాతగా, నేపథ్య గాయనిగా, శోభనాచల స్టూడియో అధినేతగా కృష్ణవేణి తెలుగు సినిమా రంగంలో ఓ సువర్ణాధ్యాయం లిఖించారని ఆయన కొనియాడారు. 'మనదేశం' చిత్రంలో నందమూరి తారకరామారావును పరిచయం చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అలాగే మీర్జాపురం రాజా, కృష్ణవేణి దంపతుల వల్లనే 'కీలుగుర్రం' చిత్రంతో అక్కినేని నాగేశ్వరరావుకి స్టార్ స్టేటస్ వచ్చిందని వెంకయ్య నాయుడు చెప్పారు. 'మా తండ్రిగారిని సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ సంస్మరణ సభలో మేం కూడా భాగస్వాములైనందుకు గర్విస్తున్నాం' అని నందమూరి మోహన కృష్ణ, రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని రమేశ్ ప్రసాద్, మురళీ మోహన్, డా.పరుచూరి గోపాల కృష్ణ, నిర్మాతలు కె.ఎస్.రామారావు, కైకాల నాగేశ్వరరావు, తుమ్మల ప్రసన్న కుమార్, కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మోగ్లీ పోరాటం



సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో సాగే ఈ అందమైన ప్రేమకథలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. సినిమాకు ఆకర్షణగా నిలిచే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. 'మోగ్లీ 2025' ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాల భైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ మారుతి ఎం.


ఇళయరాజా స్టూడియోలో సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం భేటీ అయ్యారు. స్థానిక కోడంబాక్కంలోని ఇళయరాజా మ్యూజిక్ స్టూడియోకు వెళ్లిన స్టాలిన్.. ఆయనతో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా సింఫనీ అరంగేట్రం జరుగనుండగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించేందుకు స్టాలిన్ వెళ్లినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై సీఎం స్టాలిన్ కూడా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ఆసియా ఖండంలోనే ఎవరూ చేయని ఘనతను ఈ నెల 8వ తేదీన లండన్‌లో సింఫనీ అరంగేంట్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు మన ప్రియమైన రాజా. తమిళనాడు గర్వించదగ్గ సంగీత విద్వాంసుణ్ణి అభినందించేందుకు స్వయంగా ఆయన స్టూడియోకు వెళ్లాను. ఆయన స్వయంగా చేతితో రాసిన 'వయలెంట్ సింఫనీ' సంగీత నోట్స్‌ను నాకు చూపించారు. ప్రపంచ తమిళ ప్రజల సంగీత శ్వాసగా మారిన ఇళయరాజా తలపెట్టిన ఈ సింఫనీ అరంగేట్రం విజయవంతంగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను' అని స్టాలిన్ ఆకాంక్షించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునే ప్రేమకథ



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జిగేల్'. డాక్టర్ వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ప్రేమకథ ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: వాసు, సంగీతం: ఆనంద్ మంత్ర.



అవి డీప్‌ఫేక్ వీడియోలు

విద్యాబాలన్

నన్ను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన పలు డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఉన్నది నేను కాదు, దయచేసి ఆ వీడియోలను వ్యాప్తి చేయవద్దు అని విద్యాబాలన్ నెటిజన్లను కోరారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. "సోషల్‌మీడియాలో ఈ మధ్య నాకు సంబంధించిన పలు వీడియోలు ఎక్కువగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు నేను చేసినవి కావు. అవి డీప్ ఫేక్ ద్వారా సృష్టించినవి. దయచేసి వాటిలో చెప్పే విషయాలను నమ్మొద్దు. అవి మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశముంది" అని పేర్కొన్నారు.



ముందుగానే మ్యాడ్‌స్క్వేర్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగ వంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. 'మ్యాడ్' కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 29న విడుదల కావాల్సి ఉండగా, డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు ఒకరోజు ముందుగా మార్చి 28న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. 'మార్చి 29న అమావాస్య కావడంతో మా పంపిణీదారులు చిత్రాన్ని ముందు రోజే విడుదల చేయాలని కోరారు. ఈ నిర్ణయం పట్ల మేము కూడా సంతోషంగా ఉన్నాం' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ తెలిపారు.

మాస్‌ను మెప్పించే కథతో



మలయాళ హీరో ఆంటోనీ వర్గీస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కట్టలన్'. 'మార్కో' చిత్రంతో నిర్మాతగా భారీ విజయాన్ని అందుకున్న షరీఫ్ నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌కు పాల్ జార్జ్ దర్శకుడు. ఆదివారం చిత్రబృందం ఆంటోనీ వర్గీస్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గంభీరమైన లుక్‌లో వర్గీస్ కనిపించారు. మాస్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు యాక్షన్ పార్ట్ ఈ సినిమాకు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ తెలిపింది.

విభిన్నతరహా చిత్రం



ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య ద్వయం దర్శకత్వం వహిస్తుండగా, ఆర్.యు. రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్ క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రసన్నకుమార్. టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వీరశంకర్, నిర్మాత నవీన్ యెర్నేని స్క్రిప్టును అందజేశారు. సినిమా విభిన్న తరహాలో ఉండబోతోందని మేకర్స్ తెలిపారు.

నేడు నల్లమడ రైతుసంఘ సమావేశం

పెదనందిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరస్వామి కల్యాణ మండపంలో నల్లమడ రైతు సంఘ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఛానెల్‌కు నిధులు కేటాయింపు, గత ప్రభుత్వ హయాంలో ఆందోళన సమయంలో రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేత, నల్లమడ వాగు ఆధునికీకరణ, బార్లీ, పొగాకు రైతులకు ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటించాలనే అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన ప్రకటనలో కోరారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1216 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటి మట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 196 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 164, పశ్చిమ కాల్వకు 110, నిజాంపట్నం కాల్వకు 64, కొమ్మమూరుకాల్వకు 260 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

నులకపేట వద్ద

గుర్తు తెలియని మృతదేహం



తాడేపల్లి టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణపరిధిలోని నులకపేట ఐవోసీ వద్ద ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు తాడేపల్లి పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 70 ఏళ్ల వయస్సు ఉండవచ్చునని ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తాడేపల్లి పోలీసులు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఉండవల్లిలో జూదరుల అరెస్టు

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉండవల్లి కూడలి సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.54,130లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఖాజావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు మంజూరుపై హర్షం

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

పెదనందిపాడు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట అడ్డరోడ్ నుంచి నాగభైరువారిపాలెం మీదుగా పరిటాలవారిపాలెం నుంచి అన్నవరం అడ్డరోడ్డు వరకు నూతన రహదారి నిర్మాణానికి 6 కిలోమీటర్లకు 5కోట్లు నిధులను ప్రధానమంత్రి గ్రామీణ రహదారుల నిర్మాణశాఖ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిధుల కింద విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జంపని హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. నిధుల కేటాయింపుపై సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు గ్రామ సర్పంచ్ దండా శాంతకుమారి, గ్రామ అధ్యక్షుడు ధనుంజయరావు, యాగంటి బొల్లారావు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కొప్పర్రుకు ఆర్టీసీ బస్సు సర్వీసు

● కూటమి నేతలు, గ్రామస్థుల హర్షం

పెదనందిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొప్పర్రుకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయడంపై కూటమి నేతలు, గ్రామస్థులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా గ్రామానికి బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడ్డారని, దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల జనసేన నాయకులు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు గ్రామానికి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు ట్రిప్పులు బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. దీనిపై ప్రభుత్వానికి, ఎమ్మెల్యే, ఆర్టీసీ వారికి కూటమి నేతలు బత్తిని వేణు, దాసరి శ్రీనివాసరావు, రాంబాబు, డేగల వెంకటేశ్వర్లు, కారుచోల విక్కీ, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏప్రిల్ 6న శోభాయాత్ర

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పురస్కరించుకుని ఏప్రిల్ 6న నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు హరిహర రాయల్ తెలిపారు. ఆదివారం పండరీపురంలో శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. శోభాయాత్ర సాయంత్రం 3.30 గంటలకు స్థానిక బృందావన్‌గార్డెన్స్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమై సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్రం వద్ద ముగుస్తుందని తెలిపారు. యాత్రలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జూపూడి రంగరాజు, చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరి సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి టీకాలు

ఫిరంగిపురం, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అమీనా బాద్‌లో ఆదివారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలను ఏడు ఆవులు, 150 గేదెలకు వేశామని లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్ వినీల అన్నారు. కార్యక్రమాన్ని మండల పశు వైద్యాధికారి షేక్ పీర్ అహ్మద్ పర్యవేక్షించారు.

నిఘా నీడలో గ్రామాలు

● దాతలు, దుకాణదారుల సహకారంతో..
● ప్రధాన కూడళ్లలో కెమెరాల ఏర్పాటు
● నిరంతర పర్యవేక్షణలో పోలీసులు



తాడికొండలో, లాం సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

తాడికొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో ఉన్న తాడికొండ మండల గ్రామాలు కెమెరాల నిఘా నీడలో ఉన్నాయి. రాజధాని వచ్చిన తరువాత ఇక్కడికి నిత్యం ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం వచ్చి పోతుంటారు. పనులు నిమిత్తం వచ్చే వారే కాకుండా రాజధాని లో జరిగే నిర్మాణాల్లో పనులు చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి పనులు చేసేందుకు రాకపోకలు సాగిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు సంచరించే అవకాశం ఎక్కువగా ఉంది. అంతేగాకుండా దొంగతనాలు కూడా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీం తో పోలీసులు గట్టి నిఘాని ఏర్పాటు చేసి గస్తీ కాయాల్సి ఉంది. ఇందులో భాగంగానే మండలపరిధి లోని ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను పెంచుతున్నారు. అపరిచితు లు, దొంగల కదలికలు, వాహనాల రాకపోకలు, గుర్తించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 10 హైటెక్నాలజీ కెమెరాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కెమెరాలు మను షుల కదలికలు, వాహనాల వేగం, వాహనాల నెంబర్ ప్లేట్లను స్పష్టంగా బంధించగలవు. స్థానిక సీఐ కే వాసు చొరవతీసుకుని ఆయా గ్రామాల్లో 200 పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. పొన్నె కల్లు, రావెల, బడేపురం, నిడుముక్కల, లాం, మోతడక, కంతేరు, బేజాత్‌పురం రోడ్డు, పాముల పాడు, బండారుపల్లి, గరికపాడు, దామరపల్లి, ఫణిదరం, తదితర గ్రామాల్లో కెమెరాల ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పరిమితికి మించిన వేగంతో భారీ వాహనాలను నడుపుతున్నారు. రాజధాని నిర్మా ణాలకు తాడికొండ మీదుగా వందలాది వాహనాలు నిత్యం రాజధాని ప్రాంతానికి రాకపోకలు సాగిస్తు న్నాయి. ఇతర ప్రాంతాల నుంచి రాజధానికి వివిధ పనుల నిమిత్తం వందలాది వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. కొత్తవారి కదలికలు గుర్తించడా నికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడనున్నా యి.

గ్రామాలపై నిరంతరం నిఘా

- కే వాసు సీఐ, తాడికొండ



మండలపరిధిలోని గ్రామా ల్లో నిరంతర పర్యవేక్ష ణ ఉంటుంది. అపరిచితులు ఏవరైనా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్ప టికే 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. మరో 50 కెమెరాలు త్వరలో ఏర్పాటు చేయిస్తాం. సీసీ కెమెరాల ద్వారా గ్రామాల్లో అపరిచితులు, దొంగల కదలికలను గుర్తి స్తున్నాం. దేవాలయాలు, ధనికులు వారి ఇళ్ళ ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగల కదలికలను గుర్తించవచ్చును.

మోరంపూడిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

● తొలి రోజు రెండు మ్యాచ్‌లు
● విజేతలుగా నిలిచిన సిమ్స్, మోరంపూడి సురేష్ జట్లు



పోటీలో తలపడుతున్న నాగార్జునయూనివర్సిటీ జట్టు, మోరంపూడి సురేష్‌జట్టు క్రీడాకారులు

దుగ్గిరాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మోరంపూడిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో నాలుగు జట్లు పాల్గొన్నాయి. నంబూరు వీవీఐటీ, గుంటూరు సిమ్స్ కళాశాలల జట్ల మధ్య జరిగిన జరిగిన తొలిమ్యాచ్‌లో సిమ్స్ జట్టు విజయం సాధించగా, రెండో మ్యాచ్‌లో మోరంపూడి సురేష్ జట్టు, నాగార్జున యూనివర్సిటీ జట్టుతో తలపడగా మోరంపూడి సురేష్ జట్టు విజేతగా నిలిచింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్న పోటీలను దుగ్గిరాల సాగునీటి డీసీ చైర్మన్ గొర్నేని అనిల్ ప్రారంభించారు. దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, సర్పంచ్ ఇత్తడి రమేష్, యడ్ల సాయికృష్ణ, ఇత్తడి చంటి తదితరులు క్రీడాకారులతో కరచాలనం చేసి అభినందించారు. మరో రెండ్రోజుల పాటు కొనసాగనున్న పోటీల్లో విజేతలకు ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు రూ.20,116, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15,116, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,116లు అందించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుంచి మహిళాజట్ల మధ్య కూడా వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకట్

మంగళగిరి సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ సూచించారు. మంగళగిరి మండలం కాజ టోల్ ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, సెల్‌ఫోను మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడుపరాదని, పరిమితికి మించి ప్రయాణించరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

డ్రోన్ కెమెరాతో విజిబుల్ పోలీసింగ్

ఆధునిక పరిజ్ఞానం వినియోగంలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ఆదివారం సాయంత్రం కాజ టోల్‌ప్లాజా వద్ద విజి బుల్ పోలీసింగ్ నిర్వహించారు. డ్రోన్ కెమేరా సహాయంతో అతి వేగంగా నడిపే వాహనాలను, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం తాగే వ్యక్తులను, ఇతర అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తిస్తామని ఎస్‌ఐ వెంకట్ తెలిపారు. ప్రజలు విజిబుల్ పోలీసింగ్ గమనిస్తుందన్న విషయాన్ని గుర్తెరిగి ఉండాలని సూచించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : సీపీఐ నేతలు



నివేశన స్థలాల అర్జీలను పూర్తిచేస్తున్న సీపీఐ నేతలు

మంగళగిరి సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సొంతిల్లు లేని పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నవులూరు మక్కెవారి పేటలో అర్హులైన పేదలతో అర్జీలను పూర్తిచేశారు. తిరుపతయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, 17వ వార్డు కార్యదర్శి గండికోట దుర్గారావు, పాలెం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇది బడ్జెట్ కాదు.. కోట్లాది ప్రజల కలల సాధన

● మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ

పెదనందిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ కోట్లాది ప్రజల కలల సాధన అని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని రంగాలకు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛ గుంటూరు ఛానెల్ పొడిగింపునకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చొరవతో బడ్జెట్‌లో 100 కోట్లు కేటాయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు చాగంటి సత్యహర్ష, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మోపర్తి చెంచయ్య, సంగం డెయిరీ డైరెక్టర్ శ్రీనివాసరావు, బండి నాగబాబు, కాంద్రుప్రసాద్, పోపూరి నాగేశ్వరరావు, షేక్ ఖలీల్, కొల్లా హరిబాబు, నూతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణతులసి నగర్, అభయాంజనేయ కళాప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతీ సమితి, విజయవాడ వారి సౌజన్యంతో ఆదివారం రామాంజనేయ యుద్ధంలోని యుద్ధ ఘట్టం, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించారు. కళాకారులు పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర్శన చేసి నాటకాభిమానులను ఆకట్టుకున్నారు. హార్మోనియంపై సిద్దయ్య, డోలక్‌పై రామాంజనేయులు, క్లారినెట్‌పై షేక్ నబి వాద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, టీడీపీ నాయకులు కళాకారులను సత్కరించారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న గేరా మోహనరావు

పెదనందిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చదువు అంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించుకునేందుకు గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని, పద్యపఠన, వార, మాస, గ్రూపు పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని వాటిని చదవడం వల్ల పోటీ పరీక్షలకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు రమేష్‌బాబు, శివయ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

500 మంది భక్తులతో భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గనికపూడి గ్రామంలో గల సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 500 మంది భక్తులచే భగవద్గీత పారాయణం ఆదివారం నిర్వహించారు. సీతారామస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భావనాచార్యుల ఆధ్వర్యంలో 500మంది భక్తులతో భగవద్గీతలోని 18 అధ్యాయాలను, విష్ణు, లలిత, హనుమాన్ చాలీసా పారాయణాలను నిర్వహించారు. ఇందులో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. భగవద్గీత కమిటీ మెంబరు అంచా పద్మ, ధర్మకర్త శివమ్మ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండవల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఫాల్గుణ మాసం ప్రారంభ సందర్భంగా త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఉండవల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. యోగి ప్రబోధానంద యోగపీఠం స్థాపించిన శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ఉండవల్లిలో ఇంటింటా ప్రచారం చేసి పండుగలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు బీ శివలింగంనాయక్, ఆర్ తిరుపతిరావు, జే హరి బాబు, సుబ్బారావు, శివ, అరుణ, దిల్‌సా తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య, సాంస్కృతిక రంగాలతోనే సమాజంలో చైతన్యం

● తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న జూలూరి గౌరీశంకర్, పాల్గొన్న మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని గాడిలో పెట్టే శక్తిసామర్థ్యాలు సాహిత్య, సాంస్కృతిక రంగాలకే ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం స్థానిక రెడ్డిపాలెం ఇన్నర్‌రింగ్ రోడ్డు, శ్రీరామదామం ఆవరణలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. సభను మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించగా, సభకు ముప్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టీ ఎంవీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా గౌరీశంకర్ మాట్లాడుతూ మాతృభాషను విస్మరించిన సమాజానికి మనుగడ ఉండదని, తల్లి భాష పరిరక్షణ విషయంలో తమిళులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పాలకులు తమ అధికారం కోసం మూఢనమ్మకాలను అశాస్త్రీయ భావాలను ప్రోత్సహించటం మంచిది కాదన్నారు. మార్కెట్ విష సంస్కృతిపై యుద్ధం చేస్తున్న పెనుగొండను సమాజమే సగర్వంగా అభినందిస్తుందన్నారు. రాయలసీమ రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పెనుగొండను నిజమైన అభ్యుదయ కార్యకర్తగా అభివర్ణించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మార్క్సిజం ప్రేరణతో సుదీర్ఘకాలంగా అభ్యుదయ రచయితల సంఘం బాధ్యతలను ఇష్టంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. తాను అందుకోబోతున్న అవార్డు 'అరసం'కే దక్కుతుందని తెలిపారు. అనంతరం లక్ష్మీనారాయణను మోదుగుల వేణుగోపాలరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. సభలో ప్రొఫెసర్ సుశీలమ్మ, ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడనాడాలి

డీఎస్పీ మురళీకృష్ణ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ హెచ్చరించారు. మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు తెలిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. గొడవలు, భూవివాదాలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్టులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా రౌడీషీటర్లు దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకట్, అర్బన్ ఎస్‌ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'తో చోరీల నివారణ



నిడుముక్కలలో ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాడికొండ(నిడుముక్కల), మార్చి 2(ఆంధ్రజ్యోతి): లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా గ్రామాల్లో చోరీల నివారణకు అడ్డుకట్ట వేయవచ్చునని తాడికొండ సీఐ కే వాసు పేర్కొన్నారు. ఆదివారం తాడికొండ మండలం నిడుముక్కలలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌పై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు ఆస్తుల భద్రత కోసం ఎల్‌హెచ్‌ఎంఎస్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా పోలీసులు ఇళ్లపై నిఘా ఉంచుతూ చోరీలను నివారిస్తుందన్నారు. ఇంటి భద్రతను పెంపొందించటం, ఇంటిపై నిరంతరం నిఘా ఉంచటం, పోలీసులకు తక్షణ సమాచారం చేరవేయటం అనేది ఎల్‌హెచ్‌ఎంఎస్ పూర్తిగా పనిచేస్తుందన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లోని ప్రజలు తమ ఇళ్లకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ హెడ్ కానిస్టేబుల్ గోపి, తాడికొండ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రావు

మంగళగిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాపితంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను మళ్లీ కాంట్రాక్టు విధానంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, మున్సిపల్‌శాఖ ద్వారానే జీతభత్యాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, పెరిగిన జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 3వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, రాచకొండ శివ, హరిబాబు, కార్మికులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వీరాంజనేయస్వామికి విశ్రాంత జడ్జి ప్రత్యేక పూజలు



వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విశ్రాంత హైకోర్టు జడ్జి విశ్వనాథ్

పొన్నూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయ స్వామిని ఆదివారం కర్ణాటక హైకోర్టు విశ్రాంత జడ్జి విశ్వనాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చక స్వాములు జడ్జి విశ్వనాథ్‌కు సంప్రదాయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ వీరాంజనేయస్వామికి నిర్వహించిన నాగవల్లీ దళార్చన కార్యక్రమంలో జడ్జి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఈవో గడ్డె వెంకట అమర్‌నాథ్ జడ్జి విశ్వనాథ్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు ఇచ్చారు.

రైతులకు మేలు చేయని రాష్ట్ర బడ్జెట్

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి, రైతులకు మేలు చేసేలా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ధాన్యం, మిర్చి, కంది, శనగ పంటలకు ధరలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు సంబంధించి రూ.3వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.300కోట్లతోనే సరిపెట్టిందన్నారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు ఇస్తుందని చెప్పి ఇప్పుడు కేంద్రంతో కలిసి ఇస్తామనడం రైతులను మోసగించినట్టేనన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాలని కోరారు. పంట రుణాలు, పరిహారం, పంటల బీమాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి మారీసుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాత సుఖీభవ ట్రస్ట్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నందులపేటలోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదాత సుఖీభవ సభ్యుడు ధూళిపూడి మోహనరావు వర్ధంతి సందర్భంగా వారి కుమారులు ధూళిపూడి వీరశేఖర్, సీతారామయ్య, కుటుంబ సభ్యులు సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ ట్రస్ట్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

తెనాలి మారీసుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అగాపే లవ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. స్థానిక కోగంటి శివయ్య మునిసిపల్ హైస్కూల్‌లో ఆదివారం అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దేవ, మైఖేల్ పుట్టినరోజు సందర్భంగా పదో తరగతి చదువుతున్న 20మంది విద్యార్థులకు ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పల్లికొండ రవికుమార్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్, జామెంట్రీ బాక్సు, లాంగ్ స్కేల్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కటివరపు పుల్లయ్య, ఆర్.పవన్, ఆశా కార్యకర్త బుల్ల శ్రీ లత, ట్రస్టు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొల్లిపర, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి బలమైన గాయాలైన సంఘటన మండల పరిధిలోని సిరిపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం చివలూరు గ్రామానికి చెందిన కరేటి శివప్రసాద్ తన గ్రామం నుంచి తెనాలి వెళుతుండగా సిరిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో శివప్రసాద్‌కు బలమైన గాయాలు అవ్వడంతో స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

● విరిగి, తీగల ఆధారంతో వేలాడుతున్న స్తంభం

తెనాలి రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం విరిగి లైన్లకు ఏర్పాటు చేసిన తీగల ఆధారంగా వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. మండలంలోని సంగంజాగర్లమూడి - శేకూరు రోడ్డులోని రైల్వే ట్రాక్ గేటు వద్ద నుంచి పంప్ హౌస్‌కు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లలో ఓ స్తంభం విరిగిపోయింది. దీంతో ఆ లైన్లకు ఏర్పాటుచేసిన తీగల సాయంతో గాలిలో వేలాడుతోంది. బరువు ఎక్కువై, తీవ్రమైన గాలులు వీచినా ఏ క్షణానైనా ఈ స్తంభం నేల వాలే ప్రమాదం ఉంది. సంబంధిత శాఖ అధికారులు ప్రమాదం జరగకముందే స్పందించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



తీగల సాయంతో వేలాడుతున్న విద్యుత్ స్తంభం, ఇన్‌సెట్‌లో విరిగిన దృశ్యం

నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలు

● ఆర్‌టీవో శ్రీహరి

తెనాలి క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మారిన మోటారు వాహన నూతన చట్టం ప్రకారం నిబంధనలు పాటించకపోతే భారీగా జరిమానాలు విధించడం జరుగుతుందని తెనాలి ఆర్‌టీవో కె.శ్రీహరి ఆదివారం తమ కార్యాలయంలో వీటికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైకోర్టు ఉత్తర్వులు, 2020 అక్టోబరు 21న విడుదలైన జీవో నెంబరు 21 ప్రకారం మార్చి 1 నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయన్నారు. ఈ నిబంధనలు ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే సంరక్షకులకు రూ.25వేలు, మూడేళ్లు జైలుశిక్ష, లైసెన్స్ రద్దుచేయడం జరుగుతుందన్నారు. అంబులెన్సుకు దారి ఇవ్వకపోతే రూ.10వేలు జరిమానా, ప్రమాదకరంగా డ్రైవింగ్, రేసింగ్ జరిపితే రూ.5వేలు మొదటిసారి, రెండోసారి కూడా గుర్తిస్తే రూ.10వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేస్తే మొదటిసారి రూ.1500, రెండోసారి గుర్తిస్తే రూ.10వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.1500, హెల్మెట్ లేకపోతే రూ.1000, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా హెల్మెట్ పెట్టుకోవాలి లేకపోతే రూ.1000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహన ఇన్సూరెన్స్ లేకపోతే మొదటిసారిగా రూ.వెయ్యి, 2వ సారి కూడా లేకపోతే రూ.4వేలు జరిమానా, వాహనాల ఓవర్ లోడింగ్ జరిగితే రూ.20వేలు, ట్రిపుల్ రైడింగ్ జరిగితే రూ.వెయ్యి, అధికారుల ఆదేశాలు ఉల్లంఘిస్తే రూ.2వేలు, సీటు బెల్టు ధరించకపోతే రూ.వెయ్యి, ఓలా, యూబర్‌లాంటి వాటికి సరైన పత్రాలు లేకుంటే రూ.లక్ష, మద్యం మత్తులో వాహనం నడిపితే రూ.10వేలు జరిమానాలు విధించడం జరుగుతుంది. టాక్సీ ఆటో, గూడ్స్ వాహన డ్రైవర్ల యూనిఫాం ధరించకపోతే రూ.150 నుంచి రూ.500 వరకు జరిమానా, అధికారులు ఆదేశించిన విధంగా వాహనాలు ఆపకుండా వెళ్లినా, ఆ వాహనాలు అప్పగించకుండా వెళ్లినా రూ.40వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నూతన చట్టం ప్రకారం వాహనాలు సీజ్‌చేసే అవకాశం ఉంది. కనుక వాహనదారులు నూతన నిబంధనలు గుర్తించి ప్రమాదరహితంగా వాహనాలు నడపడంతో పాటు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆర్‌టీవో సూచించారు.

బీజేపీ బలోపేతానికి చర్యలు



బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ పొన్నూరు నాయకులు

పొన్నూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి పాటుపడాలని ఆ పార్టీ జిల్లా అ ధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆదేశించారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతిరావును పొన్నూరు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందలు తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అభివృద్ధిని ప్రజల ముందుకు తీసుకువెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మోతే వెంకట శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు కామేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపారాణి, కొఠారి ప్రసాద్, ఆరే వెంకట్రావు, సాంబశివరావు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

5.1 కిలోల కణితి తొలగింపు

తెనాలి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం రోడ్డులోని దివి హాస్పటల్‌లో ఆదివారం ఒక రోగి కడుపులోని 5.1 కిలోల బరువు కలిగిన కణితిని వైద్యులు చందు ఉదయ్‌భాస్కర్ బృందం తొలగించింది. పట్టణానికి చెందిన ఒక రోగి కడుపు నొప్పి, వాపుతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఆసుపత్రిలో సంప్రదించారు. పరీక్షలు చేసిన వైద్యులు క్లిష్టమైన శస్త్ర చికిత్సను చేసి కణితిని తొలగించారు.

అపూర్వ సమ్మేళనం

● 43 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి, పూర్వ విద్యార్థులు

కొల్లిపర, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నలభై మూడు సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆనాటి స్నేహితుల పలకరింపులు, ఆప్యాయతలతో ఆ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఆదివారం కొల్లిపర మండలం వల్లభాపురంలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1981-82 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసి వివిధ ఉద్యోగ, వృత్తులలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు కుటుంబ సభ్యులతో వల్లభాపురం చేరుకుని ఆటపాటలతో, చిన్ననాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకుని ఆహ్లాదంగా గడిపారు. తొలుత దివంగతులైన పూర్వ ఉపాధ్యాయులను, విద్యార్థులను స్మరించుకుని నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని తమ మిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం ఆమె వల్లభాపురంలో కృష్ణానది తీరాన ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా న్యాయమూర్తి రాధారాణి స్వస్థలం తెనాలి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పచ్చల తాడిపర్రులో ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. నూతనంగా నిర్మించిన ఆలయంతో పాటు స్వామివారి మూల విరాట్‌ను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నవగ్రహారాధన, శాంతి హోమం, ప్రతిష్ఠ పూజలు జరిగాయి. ఈ పూజలలో స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాభిషేకం, తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కూటమి పార్టీల నాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణతులసి నగర్, అభయాంజనేయ కళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతీ సమితి, విజయవాడ వారి సౌజన్యంతో ఆదివారం రామాంజనేయయుద్ధంలోని యుద్ధ ఘట్టం, సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించారు. కళాకారులు పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర్శన చేసి నాటకాభిమానులను ఆకట్టుకున్నారు. హార్మోనియంపై ఎన్ సిద్ధయ్య, డోలక్‌పై ఎం రామాంజనేయులు, క్లారినెట్‌పై షేక్ నబి వాద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో అతిథులుగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, టీడీపీ నాయకులు బూరి సురేష్ తదితరులు కళాకారులను సత్కరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ జనార్ధనరావు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. ఆదివారం తెనాలి డీఎస్పీ కార్యాలయంలో జనార్ధనరావు త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబుతో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని అనేక నేరాలకు పాల్పడి ఆయా స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదయ్యారని, ఇకనైనా నేర ప్రవృత్తి విడనాడి ప్రశాంతమైన జీవితం గడపాలన్నారు. రౌడీషీటర్లగా ఉన్న ప్రతి ఒక్కరిపై నిఘా ఉంటుందని ఎవరైనా నేరాలకు పాల్పడుతున్నట్టు తెలిస్తే చట్టప్రకారం తీసుకునే కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీ నుంచి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం

తెనాలి అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో మరో భారీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి సిద్ధమవుతోంది. ఈ నెల 9 నుంచి అష్టోత్తర శత కోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి నిర్వహించనున్నారు. మహాయజ్ఞం కరపత్రాలను ఆదివారం తెనాలిలో నిర్వాహకులు ఆవిష్కరించారు. తెనాలి తాలూకా హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో ఆరు రోజుల పాటు నిర్వహించే మహా యజ్ఞానికి పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి, విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు 2022లో షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో 108 కోట్ల శ్రీరామనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ పూర్ణాహుతి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. 9వ తేదీన 108 కోట్ల రామనామ పారాయణ పత్రికల శోభయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు, దీక్షారాధన నిర్వహిస్తారు. 10న సుప్రభాత సేవ, మూలమంత్ర హోమం, శ్రీసీతారాములకు పంచామృత స్నపన, శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సామూహిక సరస్వతీదేవి పూజ నిర్వహిస్తారు. 11న శ్రీరుక్మిణీ కల్యాణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సామూహిక సింధురార్చన జరుగుతాయి. 12న శ్రీసీతారాముల కళ్యాణం, ఆధ్యాత్మిక ప్రవచనం, సినీ గాయకులతో భక్తిగీతాలాపన ఏర్పాటు చేశారు. 13న శ్రీసీతారామ చంద్రస్వామి పట్టాభిషేకం, ఆధ్యాత్మిక ప్రవచనం, విశేష పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో సహస్ర అవధాని గరికపాటి నరసింహారావు, మాడుగుల నాగఫణిశర్మ, ఆధ్యాత్మిక వేత్తలు మాచిరాజు వేణుగోపాల్, మాచిరాజు కిరణ్‌కుమార్, పద్మాకర్, ఆకెళ్ల విభీషణశర్మ, సుదర్శనం సీతారామాచార్యులు పాల్గొంటారని నిర్వాహకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్‌కుమార్, ఉప్పల వరద రాజులు తదితరులు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

● 13మంది జూదరుల అరెస్టు

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు వెస్ట్ డీఎస్పీ అరవింద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్‌కి పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేంద్ర నగర్ మొదటి లైనులో గల ఒక అపార్ట్‌మెంట్‌లోని ప్లాటులో పేకాట ఆడుతున్నారనే సమాచారం వచ్చింది. ఈ మేరకు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్సై నరహరి, పోలీస్ సిబ్బందితో కలిసి రైడ్ చేసి, అక్కడ పేకాట ఆడుతున్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.54 వేల 100 నగదును సీజ్ చేశారు. వారిని తదుపరి దర్యాప్తు నిమిత్తం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు. వెస్ట్ పోలీస్ సబ్-డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, బహిరంగ మద్యపానం చేసినా, ప్రజాశాంతికి భంగం కలిగే విధంగా రోడ్లపైన బైక్ రేస్ చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

దొంగతనాలతో హడలిపోతున్న ప్రజలు

● కొల్లిపర మండలంలో వరుస చోరీలు

● చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావుకు వినతి

కొల్లిపర, మార్చి 2: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. తాళం వేస్తే చాలు ఇల్లు గుల్లవుతోంది. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర తదితర గ్రామాల్లో ఏదో ఒకచోట దొంగతనం జరుగుతూనే ఉంది. ఈ వరుస దొంగతనాలు ఇటు పోలీసులకు సవాల్‌గా మారుతుంది. నెల రోజులుగా మండలంలోని గ్రామాల్లో ఏదో ఒక చోట చోరీ జరుగుతూనే ఉంది. రాత్రి వేళల్లో ఇంటి తాళం పగులగొట్టి జరిగిన దొంగతనాలు కాగా పట్టపగలే దొంగతనాలు జరగటం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. దొంగలు ఇంటి తాళాలు పగులు గొట్టడంతో పాటు బీరువాను కూడ బలమైన రాడ్డులతో పగులగొట్టి దొంగతానికి పాల్పడటంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. దీంతో ప్రజలు బయటకు పోవాలంటేనే ఎప్పుడు దొంగతనం జరుగుతుందేమోనని ప్రజలను ఆందోళన గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మండలంలోని గ్రామాల్లో దొంగతనాలు జరగటంతో ప్రజల అజాగ్రత్తగా ఉండటం కూడా ఓ కారణమని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటికి తాళం వేసి వెళ్లేముందు ఇంట్లో విలువైన వస్తువులు, అభరణాలు, నగదు ఉంచవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామప్రజలు పోలీసుస్టేషన్‌కు వచ్చి గత నెలరోజులుగా గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని గంజాయి, మద్యం మత్తులో ఉంటున్నారని తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే దొంగలను పట్టుకునేందు క్లూస్‌టీంను తీసుకురావటం జరిగిందని దొంగలను త్వరలో వారిని పట్టుకోనున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



ఎస్ఐ కోటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కొల్లిపర గ్రామస్థులు